ఈనాడు
నారాయణపేట
ఆదివారం అక్టోబరు 6, 2024



ప్రకృతి సోయగం.. ముగ్ధ మనోహరం

వనపర్తికి సమీపంలో తిరుమలయ్య గుట్టపై తిరుమలనాథుడు కొలువై ఉన్నాడు. గుట్టపై నుంచి చూస్తే ఆకుపచ్చని పర్వత శిఖరాలు కనువిందు చేస్తుంటాయి. ఆహ్లాదకర వాతావరణం.. ప్రకృతి చూపరులను కట్టిపడేస్తుంది. కృష్ణానది పరివాహక ప్రాంతం, పానగల్ కోట, పాము ఆకారంలో ఒంపులు తిరిగిన రహదారి మార్గం.. ఇలా ఎన్నో మనోహర దృశ్యాలు మైమరిపిస్తాయి.

- న్యూస్‌టుడే, వనపర్తి పట్టణం

సార్వత్రిక డిగ్రీ ప్రవేశాల గడువు పెంపు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 15 వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం సమన్వయకర్త భాస్కర్ రెడ్డి శనివారం తెలిపారు.

నిరుపయోగంగా స్వస్థత కేంద్రాలు


చిన్నపొర్లలో తెరచుకోని స్వస్థత కేంద్రం

ఊట్కూరు, న్యూస్‌టుడే: నేటి సమాజంలో ఉరుకులు, పరుగుల జీవితంలో వయస్సుతో సంబంధం లేకుండా ప్రజలు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. దీంతో రోగాల బారిన పడుతున్న పరిస్థితి నెలకొంది. వీటిని అధిగమించాలంటే మనిషికి వ్యాయామం, యోగా, ధ్యానం చేయటం ఎంతో అవసరం. ప్రజల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య స్వస్థత (యోగా శిక్షణ) కేంద్రాలు ఏర్పాటు చేసింది. కేంద్రాల్లో శిక్షకుడిని ఏర్పాటు చేసి గర్భిణులు, రోగులు, తదితర మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రతి రోజు యోగా చేయించి వ్యాధులు నయం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు యోగా శిక్షకుల నియామకం చేపట్టకపోవటంతో, నిర్మించిన ఆరోగ్య స్వస్థత కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇలా పరిస్థితి..

జాతీయ ఆయుష్ విభాగం ద్వారా ఉమ్మడి జిల్లాకు 60 ఆరోగ్య స్వస్థత కేంద్రాలు మంజూరయ్యాయి. నాగర్‌కర్నూలులో 19, మహబూబ్‌నగర్‌లో 15, గద్వాలలో 9, వనపర్తిలో 9, నారాయణపేటకు 8 కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కో కేంద్రం రూ.6 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 60 కేంద్రాలకు రూ.3.60 కోట్లు మంజూరయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్నీ కేంద్రాల పనులు పూర్తై నెలలు గడుస్తున్నా, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు ప్రారంభం కాలేదు. యోగా కేంద్రాలకు హాజరయ్యే వారికి శిక్షణ ఇచ్చేందుకు శిక్షకులను నియమించేందుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్న సమయంలో ఎన్నికలు రావటంతో వాయిదా పడింది. శిక్షకులను నియమించి వారికి యోగా మెలకువలు నేర్పించి క్షేత్రస్థాయిలో యోగా కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. యోగ కేంద్రాలు అందుబాటులోకి రాకపోవటంతో రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన ఆరోగ్య స్వస్థత కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి యోగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి...: ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో మా గ్రామంలో గతేడాది ఆరోగ్య స్వస్థత కేంద్రం పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం యోగా శిక్షకులను నియమించకపోవడంతో, నిరుపయోగంగా మారింది. కేంద్రం ప్రారంభించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లటం జరిగింది. ఉన్నతాధికారులు స్పందించి యోగా శిక్షకులను నియమించి, కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- ఎం.రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచి, చిన్నపొర్ల

సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం..

భారత ప్రభుత్వం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో పలు చోట్ల ఆరోగ్య స్వస్థత కేంద్రాలను నిర్మించటం జరిగింది. శిక్షకుల నియామకం చేపట్టకపోవటంతో కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగా శిక్షకుల నియామకం కోసం నోటిఫికేషన్ వేసి, మౌఖిక పరీక్షలు నిర్వహించింది. ఫలితాలు ప్రకటించి శిక్షకుల ఎంపిక చేసిన అనంతరం సేవలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

- డా.రఘు కుమార్, ఆయుష్ విభాగం జిల్లా ఇన్‌ఛార్జి, నారాయణపేట

పొలాల్లో కాసుల పంట

నిబంధనలకు విరుద్ధంగా స్థిరాస్తి వ్యాపారం

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఓ గ్రామంలో ఒక గుంట స్థలానికి కూడా రిజిస్ట్రేషన్లు చేశారు. ఇక్కడ స్థిరాస్తి వ్యాపారానికి ఓ వ్యక్తి వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. నాలా(వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చే చట్టం) మార్చుకోకుండానే కడీలు పాతి ప్లాట్లుగా వేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అయినా గుంటల చొప్పున ఆ వెంచరు నిర్వాహకులు రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా పలువురికి ప్లాట్లను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మండలంలో వ్యవసాయ భూములకు ప్లాట్లుగా మార్చి గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామంలో 60 ఎకరాల్లో పెద్ద వెంచరు వేశారు. దీనిని నాలాగా మార్చలేదు. అయినా 121 చదరపు గజాల చొప్పున ప్లాట్లుగా మార్చి విక్రయానికి పెట్టారు. స్లాటు బుకింగ్ చేసుకుని ఒక్కొక్కరికి గుంట చొప్పున రిజిస్ట్రేషన్ చేశారు. వీరికి పట్టా పాసుపుస్తకాలూ వచ్చాయి. వాస్తవానికి ఇక్కడ వెంచరుగా అభివృద్ధి చేసిన నిర్వాహకులు వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్ చేశారు.


గోపాల్‌పేట మండలంలో వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చిన వైనం

ఈనాడు, మహబూబ్‌నగర్-న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో పలు వ్యవసాయ భూములు వెంచర్లుగా మారుతున్నాయి. నాలాకు మార్చుకోకుండానే ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. డీటీసీపీ నుంచి అనుమతులు కూడా ఉండవు. స్థిరాస్తి వ్యాపారులు మాత్రం వ్యవసాయ భూములకు లేఅవుట్లు చేసి విక్రయిస్తున్నారు. సాధారణంగా వ్యవసాయేతర భూములకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయాలి. వ్యవసాయ భూములకు నాలా ధ్రువపత్రం లేకుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయడం కుదరదు. ఈ భూములకు రెవెన్యూ కార్యాలయాల్లోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తకుండా గుంటల్లో వీటికి రిజిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత..

పాలమూరులో కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లా కేంద్రాల సమీపంలో వ్యవసాయ భూములు వెంచర్లుగా మారాయి. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూరు, మూసాపేట, అడ్డాకుల, కొత్తకోట, పెబ్బేరు, ఎర్రవల్లి, ఇటిక్యాల, మానవపాడు, ఉండవల్లి మండలాల్లో పలుచోట్ల వ్యవసాయ భూములు వెంచర్లుగా మారాయి. కల్వకుర్తి నుంచి రాయచూరుకు వెళ్లే జాతీయ రహదారిలోని కల్వకుర్తి, మిడ్జిల్, మహబూబ్‌నగర్ అర్బన్, మహబూనగర్ గ్రామీణం, దేవరకద్ర, మరికల్, మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల్లోనూ వ్యవసాయ భూముల్లో ప్లాట్లు వెలిశాయి. చాలాచోట్ల వీటిని వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడం లేదు. గుంటల పేరుతో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లను చేస్తున్నారు.

నిబంధనలు చెబుతున్నా..

వ్యవసాయ భూములకు గుంట నుంచి 10 గుంటల మధ్య స్లాటు బుక్ చేసి రిజిస్ట్రేషన్లకు రెవెన్యూ కార్యాలయాలకు వస్తే దీనిపై విచారణ జరిపించాలి. తండ్రి లేదా తల్లికి ఎకరా స్థలం ఉండి వారికి ఎక్కువ మంది సంతానం ఉంటే (కుటుంబ సభ్యులకు) మాత్రం రిజిస్ట్రేషన్లు చేయవచ్చు. సంబంధం లేని వ్యక్తులు నిత్యం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు స్లాటు బుక్ చేస్తే తహసీల్దార్‌కు అనుమానం రావాలి. ఈ సర్వే నంబరులో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. అక్కడ స్థిరాస్తి వ్యాపారాలు చేస్తున్నారా విచారణ చేయాలి. చాలాచోట్ల ఇవేమీ చేయడం లేదు. స్థిరాస్తి వ్యాపారమని తెలిసి కూడా వ్యవసాయ భూములకు గుంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఎకరాకు 40 గుంటలు ఉంటుంది.. ఒక గుంటకు 121 చదరపు గజాలు ఉంటాయి. ఇలా గుంటల్లో ప్లాట్లుగా చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. దీనిపై మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ భూములను కుటుంబసభ్యులకు మినహాయించి ఇతరుల పేరు మీద ఐదు గుంటల వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదు. ఇతరుల పేరు మీద స్లాటు బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ల కోసం వస్తే తహసీల్దారు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

చంద్రఘంటాదేవిగా జోగులాంబ

అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అలంపూర్ ఆలయాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు జోగులాంబ భక్తులకు చంద్రఘంటాదేవి అలంకరణలో నేత్రపర్వంగా దర్శన భాగ్యం కల్పించారు. ఆలయా దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారికి అభిషేకం, స్పర్శదర్శనం, జోగులాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు.


అలంకరణలో జోగులాంబ

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించండి: ఎంపీ

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి పార్టీ సభ్యత్వాలు పెంచాలని ఎంపీ డీకే.అరుణ అన్నారు. శనివారం గుండుమాల్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎంపీ హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారని, పలు కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకొని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పార్టీ సభ్యత్వాలు పెరిగితే రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రావడం సాధ్యపడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయలేకపోతున్నారన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని అది కూడా అసంపూర్తిగా కొందరికే చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఈ ప్రాంత ప్రజలు తమ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆశ పడ్డారని, కానీ పేద రైతులను నట్టేట ముంచేందుకు నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ ఏర్పాటుకు పూనుకోవడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, అసెంబ్లీ కోకన్వీనర్ కోటకొండరాము, మండలాధ్యక్షుడు రాములు, నాయకులు మదన్, నారాయణ తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే.అరుణ

ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 195 మంది హాజరు

నారాయణపేట పట్టణం: జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సార్వత్రిక పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు శనివారం 195 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ తెలిపారు. పదోతరగతి పరీక్షలకు 85 మందికి 76 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు 135 మందికి 119 మంది విద్యార్థులు హాజరుకాగా 16 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

9 వరకు ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల అవకాశం

నారాయణపేట పట్టణం: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 9 వరకు గడువు ఉందని ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్ నాయక్ శనివారం తెలిపారు. ఐటీఐ కోర్సులలో చేరేందుకు 1.08.2024 నాటికి 14 సంవత్సరాలు నిండి పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు.

జిల్లా కేంద్రంలో సీఎం కార్యదర్శి పర్యటన

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: సీఎం రేవంత్‌రెడ్డి కార్యదర్శి మాణిక్ రాజ్ శనివారం నారాయణపేటలో పర్యటించారు. మండలంలోని అప్పక్‌పల్లి నూతన వైద్య కళాశాల వద్ద కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల, ఆర్డీవో మధుమోహన్ ఆయనకు స్వాగతం పలికారు. కళాశాలలోని కౌన్సిల్ హాల్, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అసోసియేటెడ్ ప్రొఫెసర్ గదులను పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన ప్రవేశాలు హాస్టల్, విద్యార్థులకు భోజన వసతి వంటి వివరాలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని టీఎస్ఎంఐడీసీ అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని వసతిగృహంలో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని సందర్శించారు. ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా చేయాలని సూచించారు. పుర కమిషనర్ సునీత, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వేణుగోపాల్ పాల్గొన్నారు.


15వ వార్డులో సర్వేను పరిశీలిస్తున్న సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్

వార్డులో కుటుంబ సర్వే పరిశీలన

నారాయణపేటలోని 15వ వార్డులో కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను మాణిక్ రాజ్ తనిఖీ చేసి పుర కమిషనర్ సునీతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త కుటుంబాల నమోదు ఎలా చేస్తున్నారని ప్రశ్నించగా గతంలో ఉమ్మడి కుటుంబాల్లో ఉన్న వాళ్లు ఇప్పుడు కొత్తగా తమ పేర్లు నమోదు చేసుకుంటున్నారని కమిషనర్ తెలిపారు. అనంతరం పేట ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఇన్‌పేషంట్, అవుట్ పేషంట్, ఆన్‌లైన్ నమోదు, ఫార్మసీలో ఔషధ నమోదును పరిశీలించారు. ఆస్పత్రిలో లేని ఔషధాలు ఎందుకు బయటకి రాసి పంపించారని అక్కడి సిబ్బందిని నిలదీశారు. ఆయన వెంట జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సౌభాగ్యలక్ష్మీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ మల్లికార్జున్, వైద్య కళాశాల బృందం ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్ల కష్టాలు తీరేనా?

పెబ్బేరు, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. గత ఏడాది కేంద్రాలకు టార్పాలిన్లను అందించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల సమస్యలు, వారి ఇబ్బందులను ఎలా అధిగమించాలనే విషయంపై ప్రస్తుతం అధికారుల్లో స్పష్టత కనిపించడం లేదు. కేవలం ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుంది.. కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేయాలి.. సన్న రకాలను గుర్తించేందుకు సూక్ష్మ మీటర్ ఉపయోగించడం వాటిపైనే దృష్టి సారించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 827 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధం చేశారు.


పెబ్బేరులో గతేడాది యాసంగిలో టార్పాలిన్ లేక అకాల వర్షానికి తడిచిన ధాన్యం

వీటిపై దృష్టి సారించండి..

- గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థల సమస్య వేధిస్తోంది. అరకొరగా ఉన్న స్థలంలో ధాన్యం ఆరబోసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రహదారులపై ధాన్యం ఆరబోయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.
- గతంలో ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అందించడం లేదు. వీటిని మార్కెటింగ్ అధికారులు కేంద్రాలకు సరఫరా చేయడం లేదు.
- గోనె సంచులు, లారీల సమస్య ఏటా వేధిస్తోంది. ధాన్యం కొనుగోళ్లకు సంచుల కొరత లేదంటూనే క్షేత్రస్థాయిలో మాత్రం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సంచులు లేవనే నెపంతో వారంలో ఓరోజు కొనుగోళ్లను నిలిపివేస్తున్నారు. లారీల కొరత కారణంగా కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించకపోవడంతో వర్షాలకు తడుస్తున్నాయి. తడిచిన ధాన్యం మిల్లర్లు తిరస్కరించిన సంఘటనలు ఉన్నాయి.
- కొనుగోలు కేంద్రాల్లో జీవో ప్రకారం అయిదు మంది సిబ్బంది ఉండాలి. కేవలం ఒకరిద్దరితో కొనుగోళ్లు చేస్తుండటంతో ఆలస్యం జరుగుతోంది. కొన్ని చోట్ల బస్తాలు భారీగా చోరీకి గురవుతున్నాయి. గతేడాదిలో వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్లకు చెందిన వ్యక్తులు వీటిని చోరీ చేసి బాదేపల్లి మార్కెట్ యార్డులో విక్రయించినట్లు పెబ్బేరు పోలీసుల విచారణలో తేలింది.
- వనపర్తి జిలాలోనే 700 బస్తాలకు పైగా చోరీ అయ్యాయి. ఇలాంటి చోరీ సంఘటనలు చాలా ఉన్నాయి. కేంద్రాల నిర్వాహకులు ధాన్యానికి భద్రత కల్పించలేక పోతున్నారు. నష్టాలన్నీ రైతులే భరిస్తున్నారు.

జిల్లా	దిగుబడి అంచనా (మెట్రిక్‌టన్నుల్లో)	కొనుగోలు కేంద్రాలు
వనపర్తి	4 లక్షలు	244
నాగర్‌కర్నూల్	2.18 "	244
నారాయణపేట	3.52 "	95
గద్వాల	లక్ష	55
మహబూబ్‌నగర్	1.99 లక్షలు	189

ఇబ్బందులు కాకుండా చర్యలు..: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. వనపర్తి జిల్లాలో 3,500 టార్పాలిన్లు అవసరం ఉన్నాయని, వాటిని కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని కోరాం. లారీల కొరత లేకుండా జిల్లాలో 7 సెక్టార్లను ఏర్పాటు చేసి ఒక్కో సెక్టారుకు 40 చొప్పున 280 లారీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం 25 లక్షల గోనె సంచులు ఉన్నాయి. ఇంకా 75 లక్షల సంచులకు పైగా అవసరం ఉంది. వాటిని తెప్పిస్తున్నాం. ధాన్యం చోరీ కాకుండా కేంద్రాల వద్ద గస్తీకి పోలీసులను కేటాయించాలని ఎస్పీని కోరాం.

-ఇర్ఫాన్, పౌరసరఫరాల సంస్థ డీఎం, వనపర్తి

ఆక్రమణల చెరవీడేనా!


కొడంగల్ రోడ్ సమీపంలో పాటుకాల్వ సర్వే చేపట్టిన ఇరిగేషన్ డీఈ ఆనంద్‌కిశోర్, ఏఈ నిర్మల తదితరులు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని చెరువులు, కుంటలు, నాళాల ఆక్రమణపై నీటిపారుదలశాఖ అధికారులు శనివారం సర్వే చేపట్టారు. తొలిరోజు మొత్తం 40 ఆక్రమణలను గుర్తించినట్లు తెలిపారు. పురపాలిక, రెవెన్యూ, కలెక్టర్ కార్యాలయాలకు నివేదిక అందజేస్తామని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నోటీసులతోనే సరి..

పట్టణంలోని 16 వార్డుల్లో 6,119 గృహాలు, సుమారు 25 వేల మంది జనాభా ఉన్నారు. ఇటీవల కాలంలో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు కుంటలు, పాటు కాల్వలపై కన్నేశారు. వాటిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. మరికొందరు నిర్మాణాలు చేపడుతున్నారు. పాటుకాల్వల ఆక్రమణలతో ఏటా వర్షాకాలంలో కొత్తకాలనీలు ముంపునకు గురవుతున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బృందావన్‌కాలనీ, ప్రభుత్వ దవాఖానా రోడ్డు సమీపంలో, టీచర్స్ కాలనీ, విద్యానగర్ కాలనీ, మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డులోని లద్దమడుగు పాటుకాల్వ సమీపంలో పలు ఆక్రమణలు ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలాయి. ఈ ఆక్రమణలు గతంలోనే వెలుగులోకి వచ్చినా అప్పట్లో అధికారులు నోటీసులతోనే సరిపెట్టారని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదలశాఖ డీఈ ఆనంద్‌కిశోర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా చెరువులు, బావులు, కుంటలు, పాటు కాల్వల ఆక్రమణపై సర్వే చేశామన్నారు. కలెక్టర్‌తోపాటు సంబంధిత శాఖలకు నివేదిక అందజేస్తామని, వారి సూచన మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

టమాటా కిలో రూ.120

ఆత్మకూరు, న్యూస్‌టుడే : టమాటా ధర వినియోగదారులను బెంబేలెత్తిస్తోంది. గతంలో అన్ని కూరగాయల ధరలకు రెక్కలొచ్చినా టమాటా ధర మాత్రం వినియోగదారుడికి కాస్తా ఊరటనిచ్చే విధంగా ఉండేది. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా ధర పలుకుతోంది. ఆత్మకూరులో కిలో రూ.120కి చేరింది. కర్నూల్, గద్వాల, శంషాబాద్ కూరగాయల మార్కెట్లలో కిలో రూ.వంద కొనసాగుతున్న పరిస్థితుల్లో రవాణా ఖర్చులను పరిగణలోకి తీసుకుని కిలో రూ.120 విక్రయించాల్సిన పరిస్థితి ఉందని స్థానిక కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు.



ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులకు 1: 3 నిష్పత్తిలో ప్రకారం ధ్రువపత్రాల పరిశీలనను విద్యాశాఖ అధికారులు ఈ నెల 1 నుంచి నిర్వహించారు. ధ్రువపత్రాల పరిశీలన శనివారంతో ముగిసిందని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ చెప్పారు. ఐదు రోజుల పాటు చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలన సజావుగా కొనసాగిందన్నారు. ఎస్ఏ, ఎస్జీటీ, పీఈటీ, పండిట్ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. 661 మంది అభ్యర్థులకు 585 మంది అభ్యర్థులు ధ్రువపత్రాలను పరిశీలించుకున్నట్లు డీఈవో తెలిపారు.

రెజ్లింగ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


మహబూబ్‌నగర్ జట్టుకు బహుమతిని అందజేస్తున్న డీవైఎస్‌వో వెంకటేశ్ గుప్తా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు తదితరులు

ధన్వాడ, న్యూస్‌టుడే: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని నారాయణపేట డీవైఎస్‌వో వెంకటేశ్ గుప్తా అన్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలు శనివారం ముగిశాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు మాటాడారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అండర్ 14 విభాగంలో 30 కిలోలకు సంబంధించి నందిని (మహబూబ్‌నగర్), 33 కిలోల విభాగంలో నిఖిత (మహబూబ్‌నగర్), 36 కిలోల విభాగంలో సీతామహలక్ష్మి (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. 39 కిలోల విభాగంలో శిరీష (మహబూబ్‌నగర్), 42 కిలోల విభాగంలో ప్రియమణి (మహబూబ్‌నగర్), 46 కిలోల విభాగంలో మౌనిక (మహబూబ్‌నగర్), 62 కిలోల విభాగంలో నైతిక (ఆదిలాబాద్), కీర్తి (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. 69 కిలోల విభాగంలో శివరంజని (మహబూబ్‌నగర్), శ్రుతి (కరీంనగర్), 73 కిలోల విభాగంలో సింధు (నిజామాబాద్), సపూరాలు (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 50 కిలోల విభాగంలో రజిత (మహబూబ్‌నగర్), అక్షయ (మెదక్), మొదటి స్థానం సాధించిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

అండర్-19 క్రికెట్ పోటీల రన్నర్స్‌గా పాలమూరు


రన్నరప్ ట్రోఫీతో జిల్లా క్రికెటర్లు, ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. ఫైనల్స్‌లో కరీంనగర్ చేతిలో 2 వికెట్ల తేడాతో ఓడి రెండో స్థానం దక్కించుకుంది. శనివారం వరంగల్‌లోని చెంగిచర్ల మైదానంలో నిర్వహించిన తుది పోరులో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. షాదాబ్ అహ్మద్ 89 (99 బంతుల్లో 4×11, 6×3), అబ్దుల్ రాఫె 48, అంకిత్ రాయ్ 31 పరుగులు చేశారు. అనంతరం కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసి విజయం సాధించింది. జిల్లా జట్టు నుంచి ముఖీత్ 3, షాదాబ్ 2, శశాంక్ 1 వికెట్ తీశారు. రన్నర్స్‌గా నిలిచిన పాలమూరు జట్టుకు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి శ్రీనివాస్, మహబూబ్‌నగర్ క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రాజశేఖర్‌లు ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం ప్రతినిధులు ఉదయ్ భాను రావు, ప్రవీణ్, అబ్దుల్లా, శివశంకర్ తదితరులు హాజరయ్యారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు


విజేత మహబూబ్‌నగర్ జట్టుతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు తదితరులు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడా సామర్థ్యం పెంచుకోవడంతో ఉపాధితో పాటు దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంపొందించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్ కుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు కోస్గిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు, అనంతరం బాలికల విభాగంలో ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్‌పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ తదితరులున్నారు.

చుట్టేద్దాం.. చూసొద్దాం

- తెలంగాణ దర్శినికి సర్కారు శ్రీకారం
- 3వేల మంది పాలమూరు విద్యార్థులకు అవకాశం

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉరిమే ఉత్సాహం.. కొత్త ప్రాంతాలు పర్యటించాలన్న ఆసక్తి మెండుగా ఉన్న విద్యార్థులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి విద్యార్థులకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు నిర్ణయించింది. 'తెలంగాణ దర్శిని' శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాఠశాల స్థాయిలో రెండో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రభుత్వం రూ. 12.10 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ఈ పథకం కింద చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.

ఉమ్మడి జిల్లాకు రూ. 36 లక్షలు..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య, నిధులను త్వరలో ఖరారు చేయనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సుమారు 3 వేల మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు రూ. 36 లక్షలు కేటాయించే అవకాశం ఉంది.

దసరా తర్వాత..

విద్యార్థులను విహార యాత్రకు తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఎకో టూరిజం, ఆర్ట్, క్రాఫ్ట్, వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దసరా సెలవుల తరువాత ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.


క్షేత్ర పర్యటనలో ఉమామహేశ్వరం క్షేత్రం వద్ద విద్యార్థులు

తరగతుల వారీగా విభాగాలు

విద్యార్థులు చదువుతున్న తరగతులను పరిగణనలోకి తీసుకొని నాలుగు విభాగాలుగా విభజించారు. మొదటి విభాగంలో 2-4 తరగతుల విద్యార్థులను గ్రామం లేదా మండల పరిధిలోని స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, ఉద్యానాలను సందర్శించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలి. రెండో విభాగంలో 5-8 తరగతుల విద్యార్థులు 20 కిలోమీటర్ల నుంచి 30 కి.మీ. పరిధిలోని ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పించారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు 50-70 కి.మీ. పరిధిలో ఉన్న ప్రదేశాలను రెండు రోజుల పాటు సందర్శించవచ్చు. డిగ్రీ విద్యార్థులు నాలుగు రోజుల పాటు పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సొంత జిల్లా వెలుపల లేదా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా పర్యటించి పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు అవకాశం కల్పించారు.

తరగతుల వారీగా వివరాలు

విభాగం	తరగతులు	రోజులు	దూరం (కి.మీ.లలో)	ఒక్కో విద్యార్థికి ఖర్చు (రూ.లలో)
ఒకటి	2-4	ఒక రోజు	స్థానికం (మండల పరిధి)	300
రెండు	5-8	ఒక రోజు	20-30	800
మూడు	9-ఇంటర్	రెండు రోజులు	50-70	2,000
నాలుగు	డిగ్రీ	నాలుగు రోజులు	రాష్ట్రం	4,000

వారసత్వ సంపద కాపాడుకుందాం..

తెలంగాణ దర్శిని కార్యక్రమం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించనుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోనున్నారు. వారసత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని విద్యార్థులు పర్యాటక ప్రదేశాలు సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నాం.

-డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూలు

రామ రామ ఉయ్యాలో..!



పాలమూరు రెడ్డిసేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ పట్టణం బీకేరెడ్డికాలనీలోని రెడ్డి బాలికల వసతిగృహంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సతీమణి లక్ష్మీప్రసన్న, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, మహిళా విభాగం ప్రతినిధులు వేడుకల్లో పాల్గొని బతుకమ్మలకు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు.

- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం

ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ: విమలక్క


బతుకమ్మతో విమలక్క

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : ప్రకృతి, స్త్రీలను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని ప్రజా గాయకురాలు విమలక్క అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం చెన్నారంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలు, చిన్నారులతో కలిసి బహుజన బతుకమ్మ వేశారు. నల్లమల ప్రాంతంలో 2014కు ముందు యురేనియం తవ్వకాలకు నిరసనగా ప్రజా ఉద్యమాలు చేసినట్లు గుర్తుచేశారు. రామగుండాన్ని కాపాడుకోవడం కోసం నిర్వహిస్తున్న ఈ బహుజన బతుకమ్మ తిరిగి 6వ తేదీన రామగుండం వెళ్తుందన్నారు. స్త్రీల హక్కులు, మద్యం నిషేధం, కుల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. బహుజన బతుకమ్మను గ్రామ గ్రామాన జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాశన్నయాదవ్, పరమేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్.. అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం.. ఒకరి దుర్మరణం


మృతదేహాన్ని వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు వద్ద జాతీయ రహదారి-44పై ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటలకు రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి(45) అక్కడికక్కడే మృతిచెందగా మరో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఉత్తరాది నుంచి ఇక్కడికి పనికి వచ్చిన ఇద్దరు కార్మికులు

మరొకరి పరిస్థితి విషమం

ఫ్లైఓవర్‌పై నుంచి నడుస్తూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అందులో ఒకరు మృతిచెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన వృద్ధుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడు, క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేస్తామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

సీఎం స్వగ్రామంలో ఏర్పాట్లు


కొండారెడ్డిపల్లిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎం ఓఎస్డీ చక్రవర్తిరెడ్డి, సీఎం సోదరుడు కృష్ణారెడ్డి

వంగూరు, న్యూస్‌టుడే : దసరా పండగకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి రానుండటంతో జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం ఓఎస్డీ చక్రవర్తిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం, ఏఎస్పీ రామేశ్వర్, ఏఆర్ ఏఎస్పీ భరత్, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి తదితరులు శనివారం కొండారెడ్డిపల్లిని సందర్శించి మాట్లాడారు. సీఎం ప్రారంభించనున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సౌర ప్రాజెక్టులో భాగంగా సౌర పలకలను రెడ్‌కో, విద్యుత్తుశాఖాధికారులు వేగవంతంగా ఏర్పాటు చేయాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున అధికారులు యుద్ధప్రాతిపాదికన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం సీఎం నివాసంలో సమావేశమై సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాట్లకు ప్రణాళిక రూపొందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ చిన్నఓబులేశ్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై మహేందర్, పంచాయతీరాజ్ డీఈ చంద్రకళ, ఏఈ మహిపాల్‌నాయక్, ఎంపీడీవో విజయభాస్కర్, ఏవో తనూజరాజ్, నాయకులు వేమారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకల్లో సీఎం సతీమణి


ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను మూడో రోజు కనుల పండువగా కొనసాగాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భార్య గీతారెడ్డి హాజరయ్యారు. ఆలయకమిటీ అధ్యక్షుడు రమేష్‌బాబు, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఆమె ఆలయ అభివృద్ధికి రూ. లక్ష నగదు విరాళం అందజేశారు.

ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

వంగూరు, న్యూస్‌టుడే : వచ్చే నెల నవంబర్ 20లోపు ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి అన్నారు. సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో రూ. 2కోట్లతో నిర్మిస్తున్న అంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సీఎం స్వయంగా రూ.2కోట్లు వెచ్చించి ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేపట్టారని, అందుకోసమే నాణ్యతగా పనులు చేయించాలని గుత్తేదారుని కోరారు. నవంబర్‌లో విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈ కార్యక్రమానికి సీఎం హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీఎం సోదరి సుమతమ్మ, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, నాయకులు వేమారెడ్డి, పండిత్‌రావు, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

పేట పట్టణం : 9441816587 | మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 | దామరగిద్ద : 8008573836



సమస్య: మగ్దుంపూర్‌లో అధికారుల సమన్వయ లోపంతో పట్టపగలు విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి.
- నరేశ్, మగ్దుంపూర్.

సమాధానం: వెంటనే చర్యలు తీసుకుంటాం.
- భాస్కర్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: గద్వాలగేరి మసీదు వెనక ప్రాంతంలో మురుగు కాల్వ ధ్వంసమైంది. చినుకుపడితే చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **- యాసిన్, ఊట్కూరు**



సమాధానం: సమస్య పరిష్కరిస్తాం.
- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

సమస్య: ఊట్కూరు ఎంఎంఎస్ భవనం వద్ద నిర్మించిన మిషన్ భగీరథ తాగు నీటి ట్యాంకు వినియోగంలోకి తీసుకురావాలి.
- రవి, ఊట్కూరు.



సమాధానం: పైపు లైను లీకేజీ పరీక్షలు చేయాల్సి ఉంది. దసరా అనంతరం నీటి సరఫరా అందిస్తాం.
- వెంకటేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

- న్యూస్‌టుడే, ఊట్కూరు

తెరపై ఈనాడు

మనోహర్ 70 ఎంఎం : **దేవర.** వెంకటరమణ: **దేవర**
మహేశ్వర్ 35 ఎంఎం : **స్వాగ్.** వసుంధర: **దేవర**
- న్యూస్‌టుడే, నారాయణపేట (పాతబస్టాండ్), కోస్గి గ్రామీణం, మక్తల్ గ్రామీణం

కూరగాయల ధరలు(కిలోకు)



నారాయణపేట (పాతబస్టాండ్), న్యూస్‌టుడే: టమాట రూ.70, వంకాయలు రూ.60, ముక్క వంకాయలు రూ.60, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.70, బెండకాయలు రూ.50, బీరకాయలు రూ.70, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.40, చిక్కుడు రూ.60, పెద్ద చిక్కుడు రూ.90, గోకరకాయ రూ.70, క్యాప్సికం 70, బీన్స్ 90, క్యాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.60. క్యాబేజి రూ.40, ఉల్లి రూ.70, చింతపండు రూ.120.

బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు

స్పందనకు వందనం

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లాలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల జిల్లా అధికారి సుదర్శన్ అన్నారు. శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'గోదాంలో దాచి గోప్యంగా మార్చి సరిహద్దులు దాటుతున్న చౌక బియ్యం' శీర్షికపై నారాయణపేట పౌర సరఫరాల జిల్లా అధికారి స్పందించారు. ప్రతి నిత్యం కోస్గి, మద్దూర్, దామరగిద్ద గ్రామాల్లో పర్యవేక్షించి, రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసులు నమోదు చేశామన్నారు. చిల్లర గింజలు కొనుగోలు చేసే వ్యాపార దుకాణాలపై దాడులు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు నిఘా ఏర్పాటు చేశామన్నారు. నారాయణపేట జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వ్యాపారుల వివరాలు, దుకాణాల వివరాలను ప్రజలు అధికారులకు సమాచారం ఇవ్వాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే: మంచినీటి సహాయకులు మిషన్ భగీరథ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా చేయటంలో, మారుతున్న కాలనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎంపీడీవో ధనుంజయ గౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్ సూచించారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు చేపట్టిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ నేపథ్యంలో వారికి శిక్షణ ధ్రువపత్రాలను అందజేసి మాట్లాడారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీనరసింహా రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మంచినీటి సరఫరా సహాయకులు పాల్గొన్నారు.

పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కృషి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ అన్నారు. శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద పెన్షనర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు తులిశప్ప, రాంచందర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ సంఘం నిర్వహణ కార్యదర్శి సూర్యప్రకాశ్, అరుణ, సుజాత, విద్యావతి, నర్సమ్మ, క్రిష్ణయ్యగౌడ్, దేవన్న, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల సంచారంతో ఆందోళన

కృష్ణా, న్యూస్‌టుడే: కృష్ణా మండల పరిధిలోని గుడేబల్లూర్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున అనుమానిత వ్యక్తులు గ్రామంలో మాస్కులు ధరించి తిరుగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వాహనంలో దాదాపు పది మంది వచ్చినట్లు గుర్తించిన యువకులు వారిని గమనించి గద్దించడంతో రాళ్లు విసిరినట్లు తెలిపారు. అప్రమత్తమైన అనుమానిత వ్యక్తులు అదే వాహనంలో పరారైనట్లు చెప్పారు. గొర్రెలను దొంగలించడానికి వచ్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కృష్ణా ఎస్సై ఎస్ఎం నవీద్ వద్ద ప్రస్తావించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి సుదర్శన్‌రావు హెచ్చరించారు. ఇంటర్ కళాశాలలకు నేటి నుంచి 13 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. 14న కళాశాలలు పునఃప్రారంభం కానున్నట్లు చెప్పారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించరాదని జిల్లాలో తరగతులు నిర్వహించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: వాహనదారులు ప్రయాణ సమయంలో వాహనం ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పేటలోని వీరసావర్కర్, ఎర్రగుట్ట వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాహనదారులు హెల్మెంట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో పీఎస్సై గాయత్రి, ఏఎస్సై ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అశోక్‌నగర్ మలలాంబికాదేవి ఆలయంలో...


దామరగిద్ద: మాణిక్యగిరిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


నారాయణపేట బ్రాహ్మణవాడి ఆర్య ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో


పేట: శక్తి పీఠంలో..


పేట: మహంకాళీ ఆలయంలో..


పేట: చౌడేశ్వరి ఆలయంలో


ధ్రువాపేట్ భవాని ఆలయంలో..

అమ్మవారి దర్శనం.. పులకించిన భక్తజనం

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శక్తిపీఠంలో, బ్రహ్మణావాడి చౌడేశ్వరీ మాత ఆలయంలో అన్నపూర్ణదేవీగా, అంబభవానీ మందిర్ ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో గాయత్రి దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. అశోక్‌నగర్ మలలాంబికాదేవి ఆలయంలో రంగనాయకి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది.

దామరగిద్ద, న్యూస్‌టుడే: జిల్లా సరిహద్దులో కర్ణాటక రాష్ట్రం యానగుంది మాణిక్యగిరి క్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం మూడో రోజు ఉదయం నుంచి రాత్రి వరకు లక్ష్మి వెంకటేశ్వర స్వాముల వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు యజ్ఞం, స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు. భవానిమాత ఆలయంలో ఘటస్థాపన, అకురార్పణం, నందదీపం, యజ్ఞం, అభిషేకం, అలంకరణ సహస్రనామ కుంకుమార్చనలు చేశారు.

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: మక్తల్ పట్టణంలో దేవీనవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. శనివారం శ్రీ వాసవీమాత ఆలయం వద్ద అమ్మవారు గౌరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి శేషవాహన సేవ నిర్వహించారు.


తిరుమలగుట్ట బహార్‌పేటలో..


మరికల్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


ధన్వాడ రజక భవన్‌లో గాయత్రీదేవిగా అమ్మవారు


ఊట్కూరులో అన్నపూర్ణదేవీ అలంకరణలో అంబ భవాని మాత

మరికల్, ధన్వాడ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని గాయత్రి దేవీగా అలంకరించి పూజలు నిర్వహించారు. మరికల్‌లోని శివాలయంలో, కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు ఎలిం గేండ్ల మండపంలో భక్తులు పూజలు నిర్వహించారు. ధన్వాడలోని రజక సంఘం మండపం, అంబా భవాని ఆలయంలోనూ గాయత్రి దేవిగా అలంకరించి భక్తులు పూజలు చేశారు.

ఊట్కూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని అంబా భవానీ మాత ఆలయంలో ఎస్‌ఎస్‌కే సమాజ్ కమిటీ సభ్యులు, భక్తులు శనివారం అమ్మవారిని అన్నపూర్ణ దేవీగా అలంకరించి దర్శించుకున్నారు. మండల కేంద్రంలోని ఈశ్వర్‌మందిర్ మండపం వద్ద, మండలంలోని పులిమామిడి, చిన్నపొర్ల గ్రామాల్లోని మండపాల వద్ద మూడో రోజు దుర్గా మాతను అన్నపూర్ణదేవీగా అలంకరణ చేశారు.

మద్దూరు, న్యూస్‌టుడే: మద్దూరు మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గమాత శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు అమ్మవారిని ప్రత్యేకంగా పెరుగన్నము, పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.


మక్తల్: సామూహిక కుంకుమార్చనలో మహిళలు


దామరగిద్దలో అంబాభవాని ఆలయంలో ఆకట్టుకున్న మహిళల కుంకుమార్చన


మద్దూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

వెంకటస్వామి సేవలు మరువలేనివి

నారాయణపేట, న్యూస్‌టుడే: గడ్డం వెంకటస్వామి (కాక) సేవలు మరవలేనివని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు సభ్యులు, కేంద్ర రాష్ట్ర మంత్రిగా ఎమ్మెల్సీగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో ఎం.ఏ రషీద్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్‌సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఖలీల్, కలెక్టరేట్ ఏవో జయసుధ పాల్గొన్నారు.


గడ్డం వెంకటస్వామి(కాక) చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అధికారులు

నారాయణపేట, న్యూస్‌టుడే: భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం వెంకటస్వామి జీవితం ఆదర్శమని డీఎస్పీ నల్లపు లింగయ్య అన్నారు. శనివారం జయంతి సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ, డీపీవో సూపరింటెండెంట్ శంకర్‌లాల్, ఆర్ఎస్సై శివశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లో ఫార్మా కంపెనీలొద్దు : ఎంపీ

కొడంగల్, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: పంటలు పండించే భూముల్లో కాకుండా బీడు భూముల్లో (ఫార్మా) కంపెనీలు నెలకొల్పాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం దుద్యాల మండలం హకీంపేట వద్ద ఆమె రైతులను కలిసి మాట్లాడారు. ప్రజల నమ్మకాని ఓట్లు వేసే రైతుల భూములను లాక్కోవడం సరికాదన్నారు. వారికి అన్యాయం జరిగితే ఊరుకోబోమని లేదని, రైతుల పక్షాన ఎంత దూరమైనా పోరాడతామని ఆమె తెలిపారు.


రైతులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

ప్రతి ఇంట్లో సభ్యత్వం ఉండేలా కృషి చేయండి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: ప్రతి ఇంట్లో భాజపా సభ్యత్వం ఉండేలా కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం పేట మండలం కోటకొండ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ 100 నుంచి 200వరకు సభ్యత్వం చేయించాలన్నారు. 88000 02024నంబర్‌కు మిస్ట్ కాల్ ఇచ్చి సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు, బైరంకొండ సాయిబన్న, నరసింహులు, సత్యరఘుపాల్, రవి కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళ అధ్యాపకులు, విద్యార్థులు శనివారం ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించుకున్నారు. వివిధ పూలతో బతుకమ్మను పేర్చి పాటలతో ఆడిపాడారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి సుదర్శన్‌రావు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. శ్రీసాయి జూనియర్ కళాశాలలో విద్యార్థులు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థినులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేసి అలరించారు. ఆకర్షణీయమైన బతుకమ్మలను తయారు చేసిన విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించారు.

ధన్వాడ, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థినులు బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వాటి ఆడిపాడారు. అనంతరం స్థానిక లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కోనేరులో నిమజ్జనం చేశారు.


పేట: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

దామరగిద్ద, న్యూస్‌టుడే: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఊరూరా వాడవాడ బతుకమ్మ సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దామరగిద్దలో కళాశాలలో శనివారం విద్యార్థినులు ఆట పాటలతో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.

మద్దూరు, న్యూస్‌టుడే: మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రంగ రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి విద్యార్థినులు ఆడి పాడారు.


ధన్వాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు


మద్దూరు: కళాశాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మలు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ మహమ్మద్ రఫీ తెలిపారు. సివిల్-1 ఫీడర్ పరిధిలో, చౌక్ బజార్, దర్గా ఏరియా, కురమ్మరివాడి, కలాల్‌వాడీ, బహార్‌పేట, దామరగిద్ద రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయ శిఖర నిర్మాణానికి పూజ

ధన్వాడ, న్యూస్‌టుడే: దాతల సహకారంతో స్థానిక లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శిఖర నిర్మాణానికి శనివారం పూజ నిర్వహించారు. సుమారుగా రూ.పది లక్షల మేరకు ఖర్చు అవుతుందన్న ముందస్తు అంచనా వేయగా ప్రస్తుతం దాతలు వీరభద్రప్ప, ఉమేష్‌కుమార్, బోయ బాలకిష్టయ్య, మధుసూదన్‌రావు, జుట్ల సత్యనారాయణగౌడ్ రూ. లక్ష చొప్పున విరాళం అందజేసేందుకు ముందుకొచ్చారు. మరి కొందరు భక్తులు రూ. 50 వేల చొప్పున ఇచ్చేందుకు అంగీకరించారు. వీటన్నింటి నేపథ్యంలో శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అర్చకులు సుంకు నర్సింలు, ఎమ్మెల్యే అంతరంగిక సహాయకులు చిట్టెం మాధవరెడ్డి, అఖిలపక్ష నాయకులు సుధాకర్‌రెడ్డి, టైలర్ శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్, కొండారెడ్డి, రాంచంద్రయ్య, ఉదయభాను పాల్గొన్నారు.

వ్యవసాయ చట్టాలపై అవగాహన అవసరం

ఊట్కూరు, న్యూస్‌టుడే: రైతులు వ్యవసాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పారా లీగల్ వాలంటీరు హాజమ్మ సూచించారు. మండలంలోని కొల్లూరు గ్రామంలోని రైతు వేదిక వద్ద శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం తీసుకొచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. రైతులను చైతన్యవంతం చేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఈవో నందిని, సామాజిక కార్యకర్త కె. నారాయణ, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పారా లీగల్ వాలంటీరు హాజమ్మ

మైదానంలో సౌకర్యాలు కల్పించాలని వినతి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకొని రాంలీలా మైదానంలో జరిగే వేడుకలకు సౌకర్యాలు కల్పించాలని శనివారం పుర కమిషనర్ సునీతకు విశ్వహిందూ పరిషత్తు నాయకులు వినతిపత్రాన్ని అందించారు. మైదానాన్ని శుభ్రం చేయించాలని, రావణ దహన కార్యక్రమాలకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ గౌరవ అధ్యక్షుడు క్యాతన్ రఘునాథ్, అధ్యక్షుడు మెలిగిరి కాంబ్లే, కార్యదర్శి ప్రవీణ్, భాజపా ఫ్లోర్ లీడర్ సత్యరఘుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుర కమిషనర్ సునీతకు వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

14న ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల కవాతు

ఊట్కూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఆధ్వర్యంలో ఈనెల 14న దసరా ఉత్సవాలతో పాటు ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల పథసంచలన్ (కవాతు) నిర్వహించటం జరుగుతుందని ఖండ కార్యవహ మ్యాడం లక్ష్మణ్ణ తెలిపారు. ఆరెస్సెస్ 1925 సెప్టెంబరు 27న దసరా రోజు ఆరెస్సెస్ ఆవిర్భవించిందన్నారు. మండల కేంద్రంలోని ఊర లక్ష్మమ్మ ఆలయం నుంచి ప్రభుత్వ కళాశాల ప్రాంగణం వరకు పథసంచలన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పాలమూరు విభాగ్ ప్రచారక్ దేవేందర్ రాజు ముఖ్యవక్తగా, ఆదిత్య పరాశ్రీ స్వామిజీ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

కోస్గి మార్కెట్ ఛైర్మన్‌గా భీమప్ప

మద్దూరు, కోస్గి, న్యూస్‌టుడే: కోస్గి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మద్దూరు గ్రామానికి చెందిన ముద్ది భీమప్ప ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గిరిప్రసాద్‌రెడ్డి (కోస్గి), సభ్యులుగా గండీడ్ దేవేందర్, ఎస్.లక్ష్మణ్‌నాయక్, హాజీ మోహిద్దీన్, కావలి లక్ష్మి, రాంచందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటయ్య, రావుల చెన్నారెడ్డి, కావలి చిన్న హన్మంతు, పోలీస్ రవీందర్‌రెడ్డి, పి.వీరేశలింగం, కొత్తూరు సూర్యప్రకాశ్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ మద్దూరు, జిల్లా మార్కెటింగ్ అధికారి నారాయణపేట, ఏడీఏ కోస్గి, కోస్గి పురపాలిక ఛైర్మన్ ఎన్నికయ్యారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం రఘునందన్‌రావు శనివారం ఉత్వర్వులు జారీ చేశారు.

మద్దూరు మండలానికి రెండో సారి అవకాశం : కోస్గి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా రెండోసారి మద్దూరు మండలానికి అవకాశం లభించింది. భారాస అధికారంలో ఉన్నప్పుడు జనరల్ స్థానమైన కోస్గి మార్కెట్ కమిటీకి మద్దూరు మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన వీరారెడ్డిని ఛైర్మన్‌గా ఎంపిక చేశారు. రెండేళ్ల కాల పరిమిత పూర్తైన తర్వాత కోస్గి మార్కెట్‌ను ఎస్సీ రిజర్వు చేశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ముద్ది భీమప్పను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపిక చేసింది. మద్దూరు పట్టణానికి చెందిన భీమప్ప కాంగ్రెస్‌లో పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు.


భీమప్ప

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

ఊట్కూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి డా.సౌభాగ్యలక్ష్మి ఆదేశం మేరకు శనివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యురాలు డా.శ్రీలత, ఆరోగ్య విస్తరణాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ వయోవృద్ధులు ఆరోగ్యం పట్ల జాగ్రత వహించాలని, ఆహార నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్సిహులు, ఆరోగ్య కార్యకర్త శైలజ, ఫార్మాసిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

7.954 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయానికి 55 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 38,621 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.878, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.076 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగింది. ఒకే రోజు 7.954 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 233.464, దిగువన 201.070 మిలియన్ యూనిట్లకు చేరినట్లు జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

యువకుడిని కాపాడిన మత్స్యకారులు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: కృష్ణానదిలో యువకుడు ఈతకు వెళ్లి ప్రవాహానికి కొట్టుకుపోతుండటంతో అక్కడే ఉన్న మత్స్యకారులు కాపాడారు. మక్తల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం పుట్టెంటుకలు తీసేందుకు శనివారం బీచుపల్లికి వచ్చింది. కార్యక్రమం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి యువకుడు శ్రీహరి నదిలో స్నానం చేసేందుకు దిగాడు. నదిలో ఈత కొడుతూ ముందుకెల్లాడు. గట్టుకు రాలేకపోతుండటంతో గుర్తించిన మత్స్యకారులు యువకుడిని కాపాడి ఒడ్డుకు చేర్చడంలో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

అనుచిత వ్యాఖ్యలకు ఆందోళన

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన నర్సింగానంద స్వామి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం జమాతే ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆందోళన చేసి ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మౌలనా హఫిజ్, అబ్దుల్ ఖవీ, అబ్దుల్ హమీద్ రషాదీ, మహమ్మద్ ఖాజీ, మహమ్మద్ షబుద్దీన్ నురోద్దీన్ శంశోద్దీన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహదారితో అవస్థలు

మండలంలోని జక్లేర్ నుంచి పులిమామిడికి వెళ్లే రహదారి చెరువుకట్టపై గుంతల పడి ప్రమాదకరంగా మారింది. నారాయణపేట, గద్వాల ప్రాంతాలకు వెళ్లే వాహనాలు నిత్యం రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతులు చేయడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.



– న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం

ఆదిశిలాక్షేత్రం.. భక్తజన సందోహం

మల్దకల్, న్యూస్‌టుడే: మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆశ్వీయుజ మాసం మొదటి శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే దర్శనానికి బారులు తీరారు.